www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
మంగళవారం 08 ఏప్రిల్ 2025

విలేఖరులు కావలెను




కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9494 009 003



# విద్యార్థులపై కేసులను ఎత్తివేస్తాం

- పోలీసులు, న్యాయశాఖతో చర్చిస్తాం
- 400 ఎకరాల్లో సర్వే చేయబోము
- వర్సిటీకి మంత్రుల బృందం రాదు
- భూముల వ్యవహారంపై వివిధ వర్గాలతో మంత్రుల కమిటీ భేటీ
- పోలీసు బలగాలను ఉపసంహరించాలన్న జేఏసీ
- జీవ వైవిధ్య సర్వేకు నిపుణులతో అనుమతి ఇవ్వాలన్న జేఏసీ

**కలంజ్యోతి, హైదరాబాద్ :** సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హెచ్ సీయూలో భూముల రక్షణకు పోలీసు పహారా కొనసాగుతోందని మంత్రుల కమిటీ స్పష్టం చేసింది. అయితే విద్యార్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకుంటామని వెల్లడించింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కంచె గచ్చిబౌలి సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల సబ్ కమిటీ సమావేశం సోమవారం సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచందర్ రెడ్డి పాల్గొన్నారు. సబ్ కమిటీతో హైదరాబాద్ విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ సంఘం , పౌర సంఘాల ప్రతినిధులు సమావేశమై పలు డిమాండ్లను మంత్రుల కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా క్యాంపస్ నుంచి పోలీసు బలగాలను వెంటనే ఉపసంహరించుకోవంతో పాటు నిషేధాజ్ఞలను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై ఇటీవల నమోదు చేసిన అన్ని కేసులను

మిగతా 2లో



# కొండెక్కిన కోడి

- బర్డ్ ఫ్లూ తర్వాత అమాంతం పెరిగిన ధర
- లభ్యత లేకపోవడమే కారణమంటున్న వ్యాపారులు
- కిలో చికెన్ ధర రూ.280 పైమాటే
- ఎండల నేపథ్యంలో తగ్గిన కోళ్ల దిగుమతులు

2లో

# పట్టాభిషిక్తుడైన భద్రాద్రి రామయ్య

- రాజలాంఛనాలతో ప్రత్యేక పూజలు
- సామ్రాట్ కిరీటధారిగా దశరథ రాముడు
- వేడుకలకు హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- పట్టు వస్త్రాల సమర్పణ

కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జగదభిరాముడికి సోమవారం పట్టాభిషేక మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. సీతారాముల కల్యాణం మరుసటి రోజున పుష్యమి నక్షత్రం సందర్భంగా మిథిలా స్టేడియంలో రామయ్యకు పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 10 గంటలకు శంఖ, చక్ర, ధనుర్బాణాలు ధరించిన సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను పల్లకీ సేవగా బయటికి తెచ్చారు. మేళతాళాలు, కోలాటం, భజంత్రీలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ సింహాసనంపై కొలువుదీర్చారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్న సుముహూర్తాన బంగారు సింహాసనంపై స్వర్ణఛత్ర, స్వర్ణపాదుక, రాజదండ, రాజపట్ట, రాజముద్ర, వజ్ర కిరీటాలను స్వామివారికి ప్రదానం చేశారు. లక్ష్మీదేవిని ఆవాహన చేసిన రాజముద్రికను కుడి చేతి వేలికి తొడిగారు. ఆ తర్వాత పూర్తి రాజ లాంఛనాలతో సామ్రాట్ కిరీటాన్ని శ్రీరాముడికి అలంకరించారు. తలపై సామ్రాట్ కిరీటంతో గరుత్మంతుడు, వైనేతుడులు అందించే చామరల సేవను ఆస్వాదిస్తూ భక్తులకు రామయ్య దర్శనం ఇచ్చారు.

**పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్**

పట్టాభిషేక వేడుకకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత ఆలయానికి వచ్చిన గవర్నర్‌కు దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకోగా పండితులు వేదాశీర్వచనం అందజేశారు.







## భక్తులకోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి

**కలంజ్యోతి, మల్యాల :** జగిత్యాల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలో జరగబోయే చిన్న జయంతి ఉత్సవాలలో భాగంగా అధికారులు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏడాది దీక్ష స్వాములతో పాటు సామాన్య భక్తులు సైతం భారీగా తరలి రావడంతో కొంత ఇబ్బంది తలెత్తేది. ఈసారి ఆలయం వద్దకు చేరుకున్న భక్తుల సౌకర్యార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేశారు. భక్తులు ఈ బ్రిడ్జ్ ఎక్కి కల్యాణ కట్ట, ధర్మగుండం వద్దకు చేరుకుంటారు.



## పెండింగ్ వేతనాలు అందించాలి

### 19 తరువాత నిరవధిక సమ్మె

**కలంజ్యోతి, మల్యాల :** మల్యాల మండల గ్రామ పంచాయతీ కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంపీడీఓ స్వాతికి, జీపీఈఓ శ్రీకాంత్ కు వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఏప్రిల్ 19 న నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు హెచ్చరించారు. ట్రెజరీలో నిలిచిన 2024 జులై నుండి డిసెంబర్ వరకు 6నెలల బకాయి వేతనాలు విడుదల చేయాన్నారు. సీఎం ప్రకటించిన గ్రీన్ ఛానల్ ద్వారా 2025 జనవరి నుంచి వేతనాలు చెలించాలని కోరారు. సిబ్బందిని పర్మినెంటు చేయాలన్నారు. 2వ పీఆర్సీఐ వర్తింపజేసి, ప్రభుత్వం ఇస్తున్న వేతనాలను రూ.18 వేలకు పెంచాలని, రూ.10 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఏప్రిల్ 19 తరువాత నిరవధిక సమ్మె చేపట్టన్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్మికులు కోరేపు మల్లేశం, గాసిగంటి శ్రీను, మహేష్, మల్లేశం, రవి, నర్సమ్మ పాల్గొన్నారు.



## నిరంతర విద్యుత్ అందిస్తాం..

### ఎస్ఈ సాలియనాయక్

**కలంజ్యోతి, జగిత్యాల :** వేసవికాలంలో జగిత్యాల జిల్లా ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ కృషి చేస్తుందని జగిత్యాల విద్యుత్ శాఖ ఎస్ఈ సాలియా నాయక్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని టౌన్2 సెక్షన్ పరిధిలోని విద్యానగర్ రామాలయం ఎదురుగా డీటీఆర్ 21కు సంబంధించిన ట్రాన్స్ఫార్మర్ 100 కేవీఏ నుండి 160 కేవీఏ లోడ్ గా అప్ గ్రేడ్ చేసిన నేపథ్యంలో ఎస్ఈ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలం అధిక లోడ్ వాడుతున్న నేపథ్యంలో లోడ్ ను అధికమించేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా జిల్లావ్యాప్తంగా కూడా ట్రాన్స్ఫార్మర్లను అప్ గ్రేడ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక డీఈలు రాజిరెడ్డి, గంగారాం, రవీందర్, ఏడీఈ జవహర్ లాల్, ఏఈ సంతోష్ కుమార్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొండెక్కిన కోడి



**కలంజ్యోతి, హైదరాబాద్:**
బర్డ్ ఫ్లూ తర్వాత కోళ్ల రేట్లు అమాంతం కొండెక్కాయి. జనవరి నెలలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి ప్రచారంతో చికెన్ తినడానికి ప్రజలు విముఖత కనబరిచారు. ఆ సమయంలో చికెన్ కేజీ ధర రూ.140 నుంచి రూ.160 పలకగా.. ఫిబ్రవరిలో కోళ్ల పరిశ్రమ నిర్వాహకులు మేళాలు నిర్వహిస్తే అక్కడకు పెద్ద సంఖ్యలో జనం హాజరైనా కొనుగోలు మాత్రం ముందు రాలేదు. ఇక మార్చిలో రంజాన్ మాసం ప్రారంభమయ్యాక చికెన్ అమ్మకాలు కొద్ది కొద్దిగా పెరగడం మొదలైంది. మార్చి వరకు స్కిన్ లెస్ చికెన్ కేజీ ధర రూ.220 నుంచి రూ.240 వరకు పలకగా.. ఈ నెలలో మాత్రం రూ.280 నుంచి రూ.300వరకు పెరిగింది. దీంతో బర్డ్ ఫ్లూ భయం పోయినా ధర మాత్రం బెంబేలెత్తిస్తున్నట్లవుతోంది.

**మార్చిలో పడిపోయిన ధరలు**

బర్డ్‌ఫ్లూకు తోడు రకరకాల కారణాలతో జనవరి, ఫిబ్రవరి నెలల్లో చికెన్ ధరలు అమాంతం పడిపోయాయి. దీంతో అమ్మకాలు లేక పౌల్ట్రీ ఫారాల నిర్వాహకులు కోళ్లు పెంచేందుకు వెనుకడుగు వేశారు. ఫలితంగా కొన్ని హెచరిస్ కంపెనీల నిర్వాహకులు మాత్రమే కోళ్లు పెంచారు. ఇప్పుడు తినడానికి జనం ఆసక్తి చూపిస్తున్నా.. కోళ్ల లభ్యత లేకపోవడంతో ధర పెరుగుతోంది. లైవ్ కోడి కేజీ ధర రూ.150 నుంచి రూ.160 పడుతున్నందున తాము ధర పెంచి అమ్మకం తప్పడం లేదని సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు.

**హైదరాబాద్ లో విక్రయాలు ఎక్కువే**

గ్రేటర్ హైదరాబాద్‌లో రోజూ సుమారు 10వేల టన్నుల చికెన్‌ను విక్రయిస్తుంటారని అంచనా. దసరా, దీపావళి, సంక్రాంతి, రంజాన్ పండుగల సమయంలో రోజుకు 15 వేల నుంచి 16వేల టన్నులు అమ్ముతుంటారు. నగరంలో పేరొందిన హోల్ సేల్ వ్యాపారులతో పాటు చిన్న చిన్న దుకాణాదారులు వారం, పదిరోజులకు సరిపడా కోళ్లను దిగుమతి చేసుకుని విక్రయిస్తుంటారు. ఏటా మహాశివరాత్రి పర్వదినం తర్వాత మొదలు కావాల్సిన ఎండలు.. ఈసారి ఫిబ్రవరి రెండోవారం నుంచే ప్రారంభం కావడంతో వేడికి కోళ్లు చనిపోతున్నాయి. దీంతోపాటు, ఏపీలో కోళ్లు చనిపోతుండడం వల్ల అక్కడి వ్యాపారులు హైదరాబాద్, శంషాబాద్, షాద్‌నగర్, మహబూబ్‌నగర్, తదితర ప్రాంతాల్లోని ఫారాల నుంచి కోళ్లను ఎగుమతి చేసుకుంటుండడంతో నగరంలో కొరత ఏర్పడుతోంది. నగరంలోని చాలా చికెన్ సెంటర్లలో ప్రస్తుతం జనవరి చివరి వారం, ఫిబ్రవరి మొదటివారంలో కొనుగోలు చేసిన కోడి పిల్లలే ఉన్నాయి. డిమాండ్ ఉన్నందున వాటికే రేట్లు పెంచి అమ్ముతున్నారు.

## కొండగట్టులో కొనసాగిన భక్తుల రద్దీ



**కలంజ్యోతి, మల్యాల :** కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులతో పాటు దీక్షాపరులు సైతం అధికసంఖ్యలో కొండపైకి చేరుకొని అంజన్నను దర్శించున్నారు. 11 రోజులా పాటు మాల ధరించించిన స్వాములు ఇరుములతో కాలినడకన చేరుకొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని దీక్ష విరమణ చేశారు. కాగా, చిన్న జయంతి వరకు ఇలానే భక్తుల రద్దీ కొనసాగుతుందని ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి తెలిపారు. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు టెంపుల్ ఇన్ స్పెక్టర్ హరిహరనాథ్ తెలిపారు.

# సలేశ్వరం జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్
- ఏప్రిల్ 11, 12, 13 తేదీలలో సలేశ్వరం జాతర



**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** సలేశ్వరం జాతరకు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తీ చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం నాగర్ కర్నూలు జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడితో కలిసి జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. చెంచు ప్రజల ఆరాధ్య దైవం సలేశ్వర లింగమయ్య జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏప్రిల్ 11, 12, 13 తేదీలలో (3 రోజుల పాటు) జరుపనున్న నేపథ్యంలో జాతరకు కావల్సిన సదుపాయాలను, వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. దట్టమైన నల్లమల్ల అటవీ ప్రాంతంలో లోయలలో కొలువై ఉన్న లింగమయ్య దర్శనార్థం ఇతర రాష్ట్రాల, రాష్ట్రం నలుమూలల నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చే సలేశ్వరం జాతరకు సంబంధించిన ఏర్పాట్లను, పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. జాతరలో వైద్య సేవలు, శానిటేషన్ పనులు, ట్రాఫిక్, బందోబస్తు, రవాణా, తాగునీటి, వంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సరైనా చర్యలు చేపట్టాలన్నారు. అచ్చంపేట ఆర్డీవో సలేశ్వరం జాతర నోడల్ అధికారిగా పని చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు.

కలంజ్యోతి
మంగళవారం 08.04.2025 General News
3




# వాస్తవాలు తెలిపేందుకే
# జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్

### నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు

**కలంజ్యోతి, నిర్మల్ :** దేశ ప్రజలకు వాస్తవాలను చెప్పేందుకే కాంగ్రెస్ పార్టీ జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టినట్లు డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. సారంగాపూర్ మండలం బోరిగాంలో సోమవారం జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, బాపూజీ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని కాంగ్రెస్ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్ లాంటి గొప్ప ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ అణగదొక్కాలని చూస్తుందని మండిపడ్డారు. కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. గాంధీ, అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలను దేశంలో అమలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సారంగాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, దశరథ్ రాజేశ్వర్, వెంకటరమణరెడ్డి, కోర్వా నవీన్, ముత్యం రెడ్డి, శంకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, ముక్తార్, సర్పంచులు నారాయణ్ రెడ్డి, మధుకర్, రవీందర్, భూమా రెడ్డి, నారాయణ రెడ్డి, మాణిక్ రెడ్డి, సుభాష్ రెడ్డి, లింగారెడ్డి, కృష్ణ, కైలాష్, మాజీ ఎంపీటీసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలికంగా ఆరోగ్యం కోసం కృషి చేయాలి

### జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్

**కలంజ్యోతి, జగిత్యాల :** మాతృ మరణాలు, శిశుమరణాలను అంతం చేయడానికి మహిళలు దీర్ఘకాలికంగా ఆరోగ్యంగా ఉండడం కోసం కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఐఎంఏ హాల్లో జిల్లాలోని వైద్యాధికారులు, ఎంఎల్ హెచ్ పీలకు ఆరోగ్య కార్యక్రమాలపైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం థీమ్ ఆశాజనకమైన భవిష్యత్తు కోసం ఆరోగ్యకరమైన తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యంపై ఏడాది పొడవునా నిర్వహించబడే ప్రచారం ను ప్రారంభించారు. కార్యక్రమంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపర్ ఇంటెండెంట్ డాక్టర్ సుమన్ మోహన్ రావు, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏ శ్రీనివాస్, డాక్టర్ అర్చన, డాక్టర్ జైపాల్ రెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సుధీర్, వైద్యాధికారులు, ఎంఎల్ హెచ్ పీలు పాల్గొన్నారు.






## విద్యార్థులకు క్విజ్ కాంపిటీషన్

**కలంజ్యోతి, జగిత్యాల :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక వైద్య కళాశాలలో విద్యార్థులకు క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరు అయి వైద్య విద్యార్థులకు తల్లి బిడ్డల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు రంగవల్లి పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఖాద్రి, డాక్టర్ సునీల్ , జనరల్ హాస్పిటల్ సూపర్ అంటే డాక్టర్ సుమన్ రావు,ఎం ఎస్ డబ్ల్యూ తుంగూరి వెంకటేశం, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



## ఘనంగా అంబటి జన్మదిన వేడుకలు

**కలంజ్యోతి, నర్సాపూర్ :** సంగారెడ్డి జిల్లా కార్మిక విభాగం ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంబటి అర్జున్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అంబటి అర్జున్ మాట్లాడుతూ తమ ప్రియతమ నాయకురాలు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితో కలిసి తన పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ హత్నూర మండల యువత అధ్యక్షులు తుమ్మలపల్లి కిషోర్, నాయకులు సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## టీచర్ వేధింపులు భరించలేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**కలంజ్యోతి, నాగర్ కర్నూల్ :** కస్తూర్బా గాంధీ పాఠశాలలో టీచర్ వేధింపులు భరించలేక ఓ విద్యార్థిని చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లా నాగనూలులో జరిగింది. కస్తూర్బా గాంధీ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని స్టడీ అవర్స్ కు లేటుగా వచ్చిందని ఇంగ్లీష్ టీచర్ కల్యాణి ఆగ్రహం వ్యక్తం చేసింది. సదరు విద్యార్థిని మూడు గంటల పాటు నిలబెట్టింది. వాటర్ తాగనీయకుండా, బాత్రూం కూడా వెళ్లనీయకుండా పనిష్మెంట్ ఇచ్చిందని విద్యార్థిని వాపోయింది. దాంతో మనస్థాపానికి గురై చేయి కోసుకున్నానని చెప్పింది. తమ కూతురును ఇబ్బందులకు గురిచేసి, మనస్తాపానికి గురిచేసిన టీచర్ కల్యాణిపై చర్యలు తీసుకోవాలంటూ విద్యార్థిని తల్లిదండ్రులు అధికారులుకు ఫిర్యాదు చేశారు. విద్యార్థిని వేధించిన టీచర్ పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. జరిగిన ఘటనపై ఎంఈఓ విచారణ చేపట్టారు.



# పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## కలెక్టర్ అభిలాష అభినవ్

**కలంజ్యోతి, నిర్మల్ :** ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలను అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఎస్ఎన్ సీయూ, పోస్ట్ ఆపరేషన్, ఇంజక్షన్ వార్డులను పరిశీలించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి వచ్చే గర్భిణులు, బాలింతలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసర మైన వైద్య చికిత్సలు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను సంఖ్యను పెంచాలని, ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగేలా మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, సౌకర్యాలపై రోగులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో డాక్టర్ సరోజ, సిబ్బంది పాల్గొన్నారు.



# దహన సంస్కారాలు ఉచితంగా నిర్వహించాలి

## ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి

**కలంజ్యోతి, జగిత్యాల :** నిరుపేద కుటుంబాలలో మరణించిన వారికి మున్సిపల్ ద్వారా ఉచితంగా దహన సంస్కారాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ కు భారత్ సురక్ష సమితి నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. జగిత్యాల పట్టణంలో చాలామంది నిరుపేద కుటుంబాలకు చెందిన కుటుంబాలలో ఎవరైనా మరణిస్తే స్థానిక శ్మశాన వాటికలలో దహన సంస్కారాల నిర్వహణ చాలా ఖర్చుతో కూడుకుంటుందని పేర్కొన్నారు. శ్మశాన వాటికలో నిర్వహించే వ్యక్తులు కట్టెలు, ఇతర సామగ్రి కోసం సుమారు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు డిమాండ్ చేస్తుండడంతో నిరుపేదలు ఆ ఆర్థిక భారాన్ని మోయలేక మానసిక వేదనకు గురవుతూ ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని శ్మశానవాటిక నిర్వహణ మున్సిపల్ వారికి అప్పగించి నిరుపేదలకు ఉచితంగా దహన సంస్కారాలు చేసే ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. కరీంనగర్ కార్పొరేషన్ లో ఒక్క రూపాయికే దహన సంస్కారాలు నిర్వహించే పథకం అమలులో ఉన్నందున అలాంటి పథకాన్ని జగిత్యాలలో అమలు చేసి నిరుపేదలకు అండగా ఉండాలని కోరారు. అలాగే శ్మశాన వాటిలో ఎలక్ట్రికల్ పరికరాలు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఏసీఎస్ రాజు, పుప్పాల సత్యనారాయణ, చిట్ల గంగాధర్, సింగం గంగాధర్, నారెందులూ శ్రీనివాస్, బండి సత్యనారాయణ, తునుకి అంజన్న, బండారి మల్లికార్జున్, గొల్లపల్లి సత్యనారాయణగౌడ్, బొందుకురు శ్రీనివాస్, కొత్తకొండ బలాన్నా, తకుర్ కిషోర్ సింగ్ పాల్గొన్నారు.

# విద్యార్థులపై కేసులను ఎత్తివేస్తాం

## పోలీసులు, న్యాయశాఖతో చర్చిస్తాం



▸▸ మొదటిపేజీ తరువాయి

ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికీ పోలీసు కస్టడీలో ఉన్న ఇద్దరు విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్ర సాధికార కమిటీ క్యాంపస్‌ను సందర్శించే ముందు 400 ఎకరాల కంచె గచ్చిబౌలి భూమిలో నష్టం అంచనా, జీవవైవిధ్య సర్వే నిర్వహించడానికి నిపుణులైన అధ్యాపకులు, పరిశోధకులకు అనుమతి ఇవ్వాలని కోరారు.

### మంత్రుల కమిటీ స్పందన..

వీటిపై మంత్రుల కమిటీ స్పందిస్తూ.. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం 400 ఎకరాల భూమిని రక్షించడానికి పోలీసుల పహారా తప్పనిసరి అని అన్నారు. క్యాంపస్ లోని మిగిలిన ప్రాంతాల నుంచి పోలీసులను ఉపసంహరించుకోవాలనే అంశం గురించి ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కు ప్రభుత్వం నుంచి లేఖ రాస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు, వసతి గృహాల భద్రత గురించి వీసీ హామీ ఇచ్చిన తర్వాత, 400 ఎకరాల్లో మినహా, క్యాంపస్ నుండి పోలీసులను ఉపసంహరించుకుంటామన్నారు. విద్యార్థులపై ఉన్న కేసులను ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌కు సంబంధించి వారిపై దాఖలైన కేసుల పట్ల సానుభూతితో కూడిన దృక్పథానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రుల కమిటీ హామీ ఇచ్చింది. అంతే కాకుండా, సాధ్యమైనంత త్వరగా కేసుల ఉపసమహారణకు పోలీసు శాఖ, న్యాయ శాఖతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని దృష్టిలో ఉంచుకుని తదుపరి కోర్టు ఆదేశాలు జారీ చేసే వరకు అధ్యాపకులు, విద్యార్థులతో సహా ఎవరిని 400 ఎకరాల్లో సర్వేకు అనుమతించలేమని పేర్కొన్నది. విద్యార్థులు కోరిన విధంగా యూనివర్సిటీని సందర్శించడానికి కమిటీ అనుకూలంగా ఉంది. కానీ సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతున్నదృష్ట్యా న్యాయపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికిప్పుడూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి మంత్రుల బృందం రాదని తెలిపింది. అయితే ఈ విషయంపై విద్యార్థుల సూచనలు, సలహాలు వినడానికి మంత్రుల కమిటీ సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు ప్రొఫెసర్ సౌమ్య దేచమ్మ, ప్రొఫెసర్ శ్రీపర్ణ దాస్, ప్రొఫెసర్ భంగ్య భూక్య, పౌర సంఘాల ప్రతినిధులు విస్సా కిరణ్‌కుమార్, సంధ్య, సజయ, ఇమ్రాన్ సిద్ధిఖీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనివ్వాలి

## కలెక్టర్ బి.సత్య ప్రసాద్



**కలంజ్యోతి, జగిత్యాల :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ బి.ఎస్.లత తో కలిసి కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కాగా.. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 40 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు మధుసుధన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్ కలెక్టరేట్ ఏ.ఓ హకీమ్ వివిధ జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.







# బాలీవుడ్‌లోకి అనన్య

టాలీవుడ్ ఇండస్ట్రీలో తెలుగు అమ్మాయిలు హీరోయిన్లుగా రాణించే పరిస్థితులు అంతగా లేని ఈ రోజుల్లో, అచ్చమైన తెలుగమ్మాయి అనన్య నాగళ్ల మాత్రం తన సత్తా చాటుతున్నారు. టాలీవుడ్‌లో మంచి డిమాండ్ ఉన్న హీరోయిన్ల జాబితాలో ఆమె స్థానం సంపాదించారు. మల్లేశం సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన అనన్య, పవన్ కల్యాణ్ నటించిన వకీల్ సాబ్ మూవీలో నటించే అవకాశం దక్కించుకున్నారు. ఈ సినిమాలో నటించిన తర్వాత మంచి గుర్తింపు అందుకున్న ఆమె, తంత్ర, పొట్టేల్, బహిష్కరణ (వెబ్ సిరీస్), శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ వంటి మూవీల్లో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను మరింత ఆకట్టుకున్నారు. రూ.5 కోట్ల లోపు బడ్జెట్‌తో రూపొందించే లేడీ ఓరియెంటెడ్ మూవీ నిర్మాతలకు అనన్య బెస్ట్ ఆప్షన్ అయిపోయారు. ఈ తెలుగమ్మాయి అనన్య ఇప్పుడు బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఓ హిందీ ప్రాజెక్టులో, అది కూడా లీడ్ పాత్రలో అనన్య ఎంపికైనట్లు తెలుస్తోంది.